

# పట్టుతలపాగ

బలివాడ కాంతారావు

**మీ**సాల రాజబాబుకు బొద్దు మీసాలే ఆ పేరును సార్థకం చెయ్యలేదు. అతని యింటిపేరు కూడా మీసాలవారు. అతను నల్లని వాడు. దళసరి కళ్ళద్దాలు నడివయసునించీ వున్నాయ్. అతని నలుగురు కూతుళ్లలో మిగిలివున్న ముగ్గురూ అంత చక్కదనంతో, చిక్కితే రక్తం కారే బింకంతో వున్నారంటే - అవన్నీ చంద్రబింబంతో పోల్చబడిన చంద్రమ్మ పోలికలే.

వలపుతో అతన్ని సమ్మోహపరచి, అతని పరిసరాల్లో ఆమె మంచితనంతో పచ్చదనం సృష్టించిన చంద్రమ్మ గతించిన నెల రోజులనాడే రాజబాబు చాటుగా మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. ఈ వార్త వాళ్ళ బంధువుల్లోనే కాదు, మిత్రులూ, ఆ వీధిలో వున్న వాళ్ళందరిలోనూ చాలా సంచలనం కలిగించింది.

ఈ వయసులో పీడి మీసాలక్షుషో కెందుకూ?

చక్కా ఒక అల్లుడిని యిల్లరికం వుంచుకోలేక పోయాడూ?

పోనీ ఆ పెళ్ళేదో ఒక వితంతువుని చేసుకుంటే పోయేదిగా!

ఈ పట్టుబ్రర మనిషికి యీ పట్టు తలపాగెందుకో యిప్పుడు?

సరే. జరిగిందేదో జరిగిపోయిందని దగ్గర వాళ్ళూ వూరుకున్నారా.



పోనీ ఎలా జరిగింది, ఎందుకు జరిగిందని ఆలోచించారా: ఎవరి మీదా ఆధారపడవలసిన అవసరం లేని రాజబాబు ఎందరికో సంజాయిషీ చెప్పుకోవలసిన పరిస్థితి వచ్చింది. పెన్షన్ రాళ్ళు లెమ్ముకుంటున్నా మెడలో మేనేజరుబాబులా మెసలుతున్న పాత మామగారు, బెంగాల్ టైగరనుకుంటున్న పూతిక పుల్ల లాంటి చంద్రమ్మ తమ్ముడూ, అత్తలేని కోడలు కాబట్టి ఉత్తమ యిల్లాలైపోయిన పెద్ద కూతురు, అంతా రాజబాబు యింటికి దిగబడ్డారు.

ఇంట్లోవున్న యిద్దరు కూతుళ్లూ కూడ బలుక్కొని వీళ్ళంతా ఒక్క రోజే యిక్కడకు చేరేటట్లు చేసారని తెలుసుకున్నా రాజబాబు సంబంధాలు తెగిపోనట్లే మెసలాడు. బెంగాల్ టైగరు తమ దేవార్సు మనిషిని కానని చెప్పుకోడానికి రామోసు అరుసుకుంటూనే వచ్చాడు.

అవన్నీ కల్యాణానికి కాలు దువ్వే ప్రశ్నలే:

మొదటి ప్రశ్న: "ఎందుకిలా చేసావ్?" అని అరిచాడు.

రాజబాబు సవినయంగా "చెయ్య వలసి వచ్చింద"న్నాడు.

"ఈ ముసలికాలంలో వయసు షోకు చేసుకున్నావెందుకూ?"

"కూతుర్లు వెళ్ళిపోతే నాకు బుక్కెడు గంజి కాసే వాళ్ళెవరున్నారు?".

"ఇల్లు కదల్లేని ఈ చొట్టపిల్ల నీ క్రిందేం చేస్తుంది?"

"నా మనసుకు నచ్చిన పిల్లని చేసుకున్నాను."

ఈ మాటలతో చిన్నబుచ్చుకున్న పెద్దకూతురు కోపంతో-

"మా అమ్మ మెసలిన యింటిలో యీ దిష్టిబొమ్మ?"

రాజబాబు కూతురివేపు నిదానించి చూసాడు.

"ఏమా? వయసొచ్చినా యీ వంకర గాడిదకు తిన్నగా లేదు."

"మీ పిన్నిని అలా అంటావా?"

"పిన్ని! దానికి తట్టకపోతే నీకైనా పెద్దకూతురు కన్నా వయసులో చిన్నదే అని తోచలేదా నాన్నా?"

"నా యిద్దరు మనుమరాళ్ళు సవతితల్లి పోరు పడలేరు" మామగారందుకున్నారు.

"అలా అని యిద్దరూ మీకు రాసారా?"

"తల్లిలేని పిల్లలపాట్లు ఎవరూహించలేరు?"

"యీ మీసాల వంశం యింతటితో సరి అనుకుంటే.... వీడు మా వంశోద్ధారకుడు - మీసాల చంద్రరావు పుట్టాడండీ! అసలు యీ బంగారం చంద్రమ్మ కోరిక ప్రకారం వీడి పెళ్ళానికి చెందాలి...."

"అప్పుడే ఆమె మంచిని వీళ్ళేం చూసారు?"

"వినవోయ్-ఇక్కడే ఆ పిల్ల ఉంటే నీకూ బరువు, మాకూ బరువే - అంచేత...."

"ఏం చెయ్యదలచారు?"

"ఏమిటయ్యా అలా అడుగుతున్నావ్? నువ్వు ఆలోచించే యీ పని చేసావా? పెళ్ళి కావలసిన యిద్దరు ఆడపిల్లలున్నారు- వీళ్ళ పెళ్ళి అయ్యేవరకైనా నీ మనసు కట్టుకోలేక పోయావా?"

"రొయ్యకున్నట్లు బారెడు మీసాలున్నాయిగా- ఎందుకాగుతాడూ?" అనుకున్నాడు బెంగాల్ టైగరు.

"మీరంతా కూడబలుక్కునే వచ్చారన్నమాట."

"ఇందులో కూడబలుక్కోడానికే ముందోయ్? నువ్వా కులం

తక్కువ పిల్లను పెళ్ళి చేసుకున్నావు! నీ కూతుర్లు ఎంత చక్కని వాళ్ళయినా నీ కులంవాడు నీ యింట్లో విస్తరాకు వేస్తాడా? ఇద్దరు పిల్లలు మా యింట్లోవుంటే ఆలస్యమైనా ఆ మెడలో పుస్తెలు పడ్తాయ్!" మామగార్లు అందుకున్నారు.

"అయితే తీసుకుపోడానికే నిశ్చయించారన్న మాట. మీతో వచ్చేస్తామని పిల్లలు హామీ యిస్తూ మీకు రాసారన్నమాట. కాలేజీకి వెళ్తున్నారు. పరీక్షలయ్యేవరకైనా ఆగరా?"

"మేమే నీ యింట్లో తినలేం. వాళ్ళు అన్నాళ్ళుంటే అంతా గోవిందా?"

"పోనీ వాళ్ళని వేతే వండుకోనీయండి"

బెంగాల్ టైగర్ కు ఓపిక చచ్చింది "నీ ఆంధ్రం అమరం అపవయ్యా? పిల్లలిద్దరూ మాతో వచ్చేస్తున్నారు యిప్పుడే. అసలు సంగతి తేల్చు."

"అంతా మీరే తేల్చేసారు. నేను తేల్చడానికి యేముందిక?"

"ఏముందా?- బంగారం లేదూ! ఇప్పటి ధరల్లో పాతిక వేలు ఖరీదు."

"ఏం బంగారం?"

"తల్లి సొత్తు ఆడపిల్లలిది."

"ఆ తల్లి గడించలేదుగా! మీరిచ్చిన బాలతొడుగు కావాలంటే తీసుకపోవచ్చు."

"ఎలాగివ్వవో చూస్తాం?" అరిచాడు టైగరు.

"మా హక్కును కాదన్న వాళ్ళెవరు?" పెద్దకూతురు అందుకోగానే రాజబాబు "నీ పెళ్ళి క్రింద చాలా పెట్టానమ్మా- నీకేం హక్కు లేదు. మీ చెల్లెళ్ళ బాధ్యతను మీ తాతగారు తీసుకున్నారు. వాళ్ళు ఒప్పుకుంటే నాకు తోచింది ఆనాటికి యివ్వగలను. బంగారం మీద హక్కు తేల్చే బాధ్యత మీ పిన్ని మీదవుంది."

"పిన్నీ - పిన్నీ....అని పిలవడానికి సిగ్గువేస్తోంది. ఆ బంగారంతో యీవిడను సింగారించినా మా అమ్మ కాలిగోటికి సరిపోదు."

రాజబాబు నిదానంగా "అవును. మీ అమ్మకు యీ బంగారంతో సింగారించేక జబ్బు మనిషై పోయింది. చచ్చిపోతూ నేనెంత దురదృష్టవంతురాలను అని ఏడ్చింది. నీకేం? ముగ్గురు బంతుల్లాంటి బిడ్డలన్నాను. ఇంకా గట్టిగా యేడ్చింది."

"ఒక్కనాడు మాతో అనలేనిది మీతోనే అన్నదా?"

"జీవితంలో పెట్టుకోక పెట్టుకోక రెండే కోరికలు పెట్టుకున్నాను. దేముడు ఆ కోర్కలు తీర్చుకునే అదృష్టం యివ్వలేదని యే కరువు పెట్టి ఏడ్చింది. ఆ యేడుపూ, ఆ నాటి పరిస్థితీ నా గుండెను కరిగించి వేసింది. నా యిన్నేళ్ళ సహవాసం ఆమె కోర్కెలను తీరిస్తే గానీ ఆమెకు ద్రోహం చేసిన వాడి నౌతానని ..."

"ఇంకా ఆ బుగ్గిమన్నులో కలవకుండానే పెళ్ళి చేసుకున్నావ్...." పెటకారంగా అన్నాడు పైగరు.

"ఆ కోరిక లేవో చెప్పనాన్నా?" అంది పెద్ద కూతురు.

"నా దగ్గర నా కూతురు ఏదీ దాచలేదు. ఒకనాడూ నా చెవిలో వెయ్యలేదు. ఇవన్నీ కట్టు కథలు" అంటూ మామగారు లేచిపోయారు.

"అయితే బంగారం యివ్వనంటావు?" పైగరు. అందుకున్నాడు.

"నా చంద్రం మీకిమ్మని చెప్పలేదు. అది ఏం చెయ్యమందో అదే చేస్తాను."

"ఏం చెయ్యమంది?"

"ఇప్పుడేదీ చెప్పదలచుకోలేదు. అవసరం వచ్చినప్పుడే చెప్తాను."

"ఈ వేళతో సంబంధాలు తెంపేస్తున్నావన్న మాట."

"మీరే అంతా తెంపేసి వెళ్తున్నారు."

లేచిన వాళ్ళు ఎలా వచ్చారో అలాగే వెళ్ళిపోలేదు. పంతాలు పెరిగాయి గానీ తరగలేదు. పెళ్ళి కావలసిన యిద్దరి ఆడపిల్లల భారం నెత్తిన వేసుకున్నాడు కాబట్టి మామగారి చిరాకుపాలు పెరిగింది. మనసు చెదిరిపోయిన వాళ్ళు మమకారం పేరుచెప్పి, మొదలు పట్టుకునే పరిస్థితికి వచ్చారు. వంట యింట్లో కుందేలులా దాగున్న కొత్త పెళ్ళికూతురు రాజబాబు మనసులో మెసలటం వలన పరిస్థితిని చెయ్యి దాటిపోనివ్వలేదు.

వాళ్ళంతా వెళ్ళాక యిల్లంతా మూగబోయింది. పెళ్ళికూతురు కళ్ళల్లో నీరు తిరిగి వుంటుందని వంట ఇంటికి వెళ్తే ఆమె అతని వేపు ఒకసారి నిదానంగా చూపింది. అతను వెర్రి నవ్వు నవ్వితే, ఆమె చిరునగవు వెలగబోసింది. ఆ నవ్వులో దాగున్న భావాలు మనసుకు తట్టి మహదానందంతో, తృప్తితో వూగిసలాడాడు. ఈ అంగవైకల్యానికి నేను బాధ్యురాలను కాదు. నా కర్మ యిలా కాలిందని ఏడుస్తూ కూర్చోలేదు. గుండెనిబ్బరానికి కావలసిన వూహలను మనసులో పొంగించి మానవత్వాన్ని అద్దం పట్టి

చూపిస్తోంది.

ఆ గుండె నిబ్బరం నెల రోజుల్లో ఆ వీధినించి మకాం మార్పించింది. ఇదివరకటికన్నా చిన్న ఇల్లు. ఒక్కగది వంటకీ, భోజనానికీ యింకో గది. పెరట్లో పచ్చదనం. అంగట గచ్చు చేసిన వాకిట్లో ఒకమూలకు పారిజాతం చెట్టు. రాత్రంతా ఘుమ ఘుమలు. తెల్లారేసరికి బుట్టెడు పూలు రాలేవి. సాయంత్రమైతే చెట్టు దగ్గరలో చేరిన పిల్లలకు చదువుచెప్తూ వాసన గల పూలుగా మారుస్తోంది పారిజాతం.

ఇవన్నీ యెవరికో రాద్దామని రాజబాబు వుబలాటం. ఇవి ఎవరికైనా రాస్తే వాళ్ళు సంతోషించామని జవాబిస్తే తను ఎంత మంచి పని చేసానో అన్న తృప్తివచ్చేది. ఒక మంచి పేరు పెట్టి, కొంత చదువు చెప్పించిన కొత్త మామగారు ఏనాడో పోయారు. పారిజాతం అన్నయ్యకు ఎదుటి వాళ్ళ సంతోషం, తన సంతోషంగా తీసుకునే అలవాటు లేదు. అతని భార్య సున్నితంగా కనిపిస్తుంది గానీ, ఆమె మనసు హైస్పీడుస్టీలు, మాట రంపపు కోత. పోనీ పాత మామ గారింటవున్న కూతుర్లకి రాద్దామని నాందీప్రస్తావనగా పంపిన నూరు రూపాయల మనియార్డరు తిరిగి వచ్చింది.

ఇంకో నెల రోజుల్లో యింట్లో ఎన్నో మార్పులు వచ్చాయి. దురదృష్టాన్ని అదృష్టం వేపు మళ్ళించడానికి ఆమె చేసే ప్రయత్నంలో తనూ చేయూత నిచ్చాడు. ఎవరి కర్మబట్టి వాళ్ళ బ్రతుకులని యిదివరకు నమ్మిన రాజబాబు ఇప్పుడు ఎవరి అదృష్టానికి వాళ్ళే కర్తలని సంచరిస్తున్నాడు.

ఇవన్నీ చిన్న కూతురుకి వుత్తరం రాసాడు. జవాబు రాకపోగానే మనసులో పొరుతున్న యీ ప్రవాహ లిచ్చే ఆహ్లాదాన్ని తనే అనుభవిస్తూ యీ సారి వుత్తరం రెండో కూతురికి రాసాడు.

"మీరంతా నేనేదో తప్పు చేసానంటున్నారు. నేను తప్పు చేసాననుకుంటే దీనికి కారకులెవరు? నీ అక్క యిలా వచ్చి అలా వెళ్ళిపోయింది. తన సంసారం తల్లక్రిందులయి పోతాదని దాని బాధ. కాన్సరుతో మంచం పట్టిన తల్లి క్రింద పట్టుమని పది రోజులు సేవ చేసిందా? ఇక యింట్లో వున్న మీ యిద్దరూ రోజులు గడుస్తున్న కొద్దీ విసిగిపోయారు. కంపు అని ముక్కులు మూసుకున్నారు. ఒంటరిది ఆ చివరి గదిలో, చ్యావంటే

భయం, నాకేదో సుఖ పెట్టకుండా పోతున్నానన్న బాధ, బ్రతుకుమీద మమకారం, ఒంటరితనంతో సతమత మయ్యేది. అలాంటప్పుడు సేవ చేసేవాళ్ళు కాదు— దగ్గర వుండి ధైర్యం చెప్పేవాళ్ళ అవసరంవుండేది. మీకు కాలేజీ చదువు ముఖ్యం. మీ సినిమాలు మీరు విడిచిపెట్టుకో లేదు. మీ కోరికలు కొంత చంపుకొని చావబోయే తల్లి చెంత వుండలేక పోయారు. మీ నడత చూసి మీ అమ్మ ఒకనాడు బోరున ఏడ్చింది. నా కష్టానికి కాని బిడ్డలూ నా కడుపున పుట్టలేదంది. నాది అన్నది వాళ్ళకేమీ చెందకూడదంది. అయితే, యింకెవరికి చెందా లన్న నా ప్రశ్నకు మీ అమ్మ సమాధానం యివ్వలేదు. నేను ఆఫీసుకు పోయే టైములో ఆమెకు తోడు కావాలి. ఆ తోడు ఆ వీధిలోనున్న పారిజాతం యిచ్చింది. ఏ మాత్రం అసహ్యించుకోకుండా చెయ్య గలిగినదంతా చేసింది! చావంటే భయం లేనంత ధైర్యాన్ని మీ అమ్మలో సృష్టించింది. అందుకే కామోసు "యింత వయసు పోసుకున్న నేను చీమంత మనిషిని- యీ పారిజాతమే నిజంగా పారిజాతం చెట్టండీ" అంది మీ అమ్మ. "నన్ను మల్లెపువ్వన్నారు, చామంతి అన్నారు. అందరికీ పారిజాతాలు దొరక"వంది. చనిపోతానని తెలుసుకుని ప్రాణం పోయేముందు మీ ఎవరి ముఖాలు చూస్తాననలేదు. పారిజాతం ముఖం చూస్తానంది. ఆ మనసులో వున్న రెండు తీరని కోరికలు మీ ఎవ్వరితోనూ చెప్పలేదు. ఆమెతో చెప్పగా దగ్గరున్నాను కాబట్టి విసగలిగాను.

మీ అమ్మపోయేక మీ అమ్మ మాటల్లోని అర్థాలు వెతుక్కొని అన్నీ వారం రోజుల పాటు ఆలోచించుకుని తర్జన భర్జనలుపడి నన్ను పెళ్ళాడతావా అని అడిగితే—

"మిమ్మల్ని పెళ్ళాడడానికి నాకెట్టి అభ్యంతరం లేదు గానీ, ఒక్కటే అభ్యంతరం...."

"వయసులో చాలా తేడా వుందనా?". అని అడిగాను.

"అబ్బే, మీ వయసు ముదిరినా ముదరకుండా మీ మనసు కాపాడుతోంది" అంది.

"అయితే దేనికీ నీ అభ్యంతరం?" అడిగాను.

"అక్క సేవ యిందు కోసమే చేసానని మీ పిల్లలే అంటారేమో నన్న సందేహం."

"నా పిల్లలు చదువుకున్న వాళ్ళు, పరిస్థితిని అర్థం చేసుకుంటారన్నాను."

"అయితే నా అభ్యంతరం

యేమీ లేదండి"

నేను యింకో విషయం కూడా ఆలోచించాను. నీ అక్క పెళ్ళయ్యాక అత్తవారి మనిషయిపోయింది. మీ యిద్దరూ ఏదో ఒక నాడు అలానే అయిపోతారు. నాది ఒంటరి బ్రతుకు. నా బట్టలు నేను వుతుక్కోలేను. నా వంట నేను చేసుకోలేను. బాధ్యతలుండవు. దానితో నా మనసు మూగదయిపోతుంది. జీవితం దుర్భరమన్పిస్తుంది. ఇంకా నాలో పచ్చదనం వుంటే కోరి పండుటాకయిపోవటం యిష్టంలేదు. ఒక మంచి మనిషి యింట్లో మెసలుతుంది. మీ అమ్మ తెచ్చుకోలేని అదృష్టాన్ని మీ పిన్ని తెచ్చుకోకూడదా?

మీ ముగ్గుర్నీ నేను కొడుకుల కన్నా మిన్నగా చూసానని మీ తాతే అనేవాడు. పరిస్థితి అర్థం చేసుకోక పోవటం వలన నా బిడ్డలను నాకు దూరం చేసి నాపై కత్తి గట్టాడు. మీ యిద్దరూ వెళ్ళి ఆర్నెల్లయినా ఆరేళ్ళు అనిపిస్తోంది. మీ యిద్దరూ నా సంతానం! యింకా నా బాధ్యత వుందన్న విషయం ప్రతి క్షణం గుర్తు కొస్తోంది. మీ యిద్దరి చల్లని చేతులతో వుత్తరాలు వస్తే మిమ్మల్ని పెంచిన తీరుకు ప్రతిఫలం అందుకున్నానని సంతోషిస్తాను."

ఇలా రాసినా జవాబు రాలేదు. తరువాత యింకో వుత్తరానికి జవాబు లేదు. ఏడాది పోయాక వెయ్యి రూపాయలకు చెక్కు పంపిస్తే దాని మీద 'వద్దు-వద్దు' అని చెక్కు వెనుక రాసి, సంతకం పెట్టకుండానే పంపించింది చిన్న కూతురు.

కూతుళ్ళు వెళ్ళాక రెండేళ్ళు దగ్గర కావచ్చింది. వాళ్ళ క్షేమాలు వాళ్ళెవరి ద్వారా తెలియకపోయినా ఆ వూర్లోవున్న ఒక దూరపు బంధువు వలన తెలుస్తున్నాయి.

యీ సారి పెద్ద కూతురికి వుత్తరం రాసాడు.

"ఆ వేళ మీరందరూ వచ్చిన నాడు నేను మీరంతా కోరినట్లు మీ అమ్మ బంగారమంతా యిచ్చేస్తే బహుశః నేనిన్నాళ్ళు నా యిద్దరి కూతుళ్ళకు దూరమయ్యే వాడిని కాదేమో? బహుశః ఆ బంగారం మీకు తప్పితే యింకెవరికి చెందుతుందన్న ధీమాతోనే మీ ముగ్గురిలో యే ఒక్కరూ ఆమె క్రింద మనస్ఫూర్తిగా తల్లి అనే మమకారంతో సేవ చెయ్యలేదనుకుంటాను. ఆ కోపంతో మీ అమ్మ చనిపోయింది. చనిపోతూ ఆ కోపంలో కొంత నా పరం చేసి

పోయింది. తరువాత యింకో విషయం వేధించడంవలన బంగారం ఆరోజు మీరంతావస్తే యివ్వలేకపోయాను. అది ఆనాడు బలమైన కారణంగా నాకు తోచడం వలన మీకు బంగారం పంచిపెట్టలేదు. అప్పుడే ఎన్నో నెలలు దాటిపోయాయి. నా కన్నబిడ్డలకీ నాకూ మధ్య యింత అఘాతము సృష్టించి దూరం చేసిన యీ బంగారానికి యింత విలువ ఎందుకివ్వాలని నా మనసు బాధపడుతోంది. ఐనా దీని విలువను తగ్గించలేకపోయాను. అంతకన్నా విలువైనదీ నన్ను ఉత్తేజపరిచిందీ దొరికాక, యీ బంగారం నాకంటికి విలువ లేనిదైపోయింది.

నీకు కొన్ని విషయాలు తెలుసుకోవాలని కుతూహలం వుండటము సహజము కదా! మీ అమ్మ యీ బంగారం ఎలా సంపాదించింది? యెందుకు సంపాదించింది? చనిపోతూ మీ అమ్మ కోరుకున్న రెండు కోరికలేవి? నా దృష్టిలో బంగారం విలువ తగ్గిపోడానికి కారణం - ఇవన్నీ తెలుసుకోవాలంటే మీ ముగ్గురు అక్కచెల్లెళ్లు మీ అమ్మ బంగారం తీసుకపోడానికి కలిసి రండి. ఆరోజు యెవరెవరెదరగా కాదన్నానో వాళ్ళ యెదరగా ఔనని బంగారమంతా అందజేస్తాను. నీ తండ్రి సంగతి నీకు తెలుసు. ఈమాత్రం నా మాట నమ్ముతావనే విశ్వాసం వుంది. ఏ బండిలో అంతా కలిసి వస్తున్నారో రాస్తే స్టేషనుకు వస్తాను. చాలా రోజులైంది ఇల్లు మార్చి- పోల్చుకోవడం కష్టం. మీరు యీ నెలాఖరులోగా రాకపోతే మీకూ నాలానే యీ బంగారము మీద మోజు పోగొట్టిన సంఘటన ఏదో జరిగి వుంటుందని బంగారమంతా అమ్మి మీ అమ్మ పేర ఒక అనాథ శరణాలయం (చిన్నదే అనుకో) కట్టించేస్తాను.

—నీ నాన్న"

యీ సారి వెంటనే వుత్తరం- అమ్మ బంగారం అమ్మవద్దని. తనే స్వయంగా చెల్లెళ్ళ దగ్గరకి వెళుతున్నానని అక్కడనించే వుత్తరం రాస్తానని. ఆ మూడు రోజుల నాడే ఫలానా బండికి వస్తున్నామని టెలిగ్రాం వచ్చింది.

రాజబాబు రైల్వే స్టేషనుకు వెళ్ళి పాత మామగార్ని, బెంగాల్ టైగర్ని ఇంటికి తీసుకు వచ్చాడు. చిన్న ఇల్లు. అంతా నిశ్శబ్దంగా వుంది. యీ నిశ్శబ్దం వీళ్ళందర్లో ఎన్నెన్నో ఆలోచనలను రేకెత్తించింది. పాపం ఈ చొట్ట భార్య

గతించిందేమో! దానితో వైరాగ్యం వచ్చి రాజబాబు యీ బంగారము అంతా ఇచ్చి వేస్తున్నాడేమో! ఇదే విషయం ఎత్తకుండా కళ్ళల్లో నీరుబుకుతున్నా తమా యించుకుని రాజబాబు—

"యీ రోజు మంచి రోజు. నా ముగ్గురు కూతుర్ల ముఖాలు ఎన్నేళ్ళకో చూసాను. కానీ, నేను కులం లేని వాడ్ని. నా ఇంట్లో కాఫీ నీరైనా నా బిడ్డలు తాగరు. సరే! మీరు కులం గల వాళ్ళు వండిన వంటకాలు హోటల్లో తింటారు కాబట్టి మిమ్మల్ని అనవసరంగా ఆలస్యం చెయ్యదల్చుకోలేదు. నేను పెద్ద అమ్మాయికి రాసిన మూడు విషయాలు వేగిరంగా చెప్పేస్తాను. నా భార్య చంద్రమ్మ సంసారం గుట్టుగా చేసి మిగిల్చిన డబ్బుతో ప్రతి నెలా ఎంతో కొంత బంగారం కొనేది. ఇలా పదిహేనేళ్ళు చేసి ఇంచుమించు అరవై తులాల బంగారం కొన్నది! నాలుగో సంతానం కూతురు పుట్టిపోగానే బంగారం మీద మమకారం పోయింది. ఎందుకిలా కూడవేస్తున్నావంటే ఒక్కనాడూ ఆడపిల్లల గురించని చెప్పలేదు. చచ్చిపోయేముందు చెప్పింది"

"ఏమని?"

"కోడలి కోసమని. నాలుగో సంతానం కూతురు పుట్టిపోగానే ఆమెకు కోడలు వస్తుందన్న ఆశ పోయిందట. అప్పటినించీ తనకు అదృష్టంలేదని ఆ అదృష్టం వుంటే ఒక్క కొడుకైనా పుట్టేవాడనీ, పోనీ కనీసం యీ చచ్చే సమయంలో యీ అద్దె కొంపలో కాకుండా స్వంత ఇంట్లో పోయానన్న తృప్తి అయినా లేదని యేడ్చింది. ఆ యేడ్చిన కొంపలో నాకు ప్రతి నిమిషం ఆ కోరికే వేదించేది. ఈ ఇంట్లో మొదట అద్దెకు దిగాను. తరవాత ఇంటి వాళ్ళు వాళ్ళేదో పెద్ద ఇల్లు కట్టించుకుంటున్నారట. డబ్బు అవసరం వుందని అమ్ముతుంటే నేనే కొన్నాను. ప్రావిడెంట్ ఫండులో లోను పెట్టి నా పరపతి అంతో ఇంతో వుపయోగించి కొన్నాను. అప్పటిలో ఈ బంగారం అమ్మ దానికి చేతులొచ్చాయి కావు. ఇంకా దీనికెంతో విలువ వుందనుకున్నాను. కానీ ఇంటిని చూసాక బంగారంమీద మోజు పోతూంది.

దీన్ని కాపలా కాసుకునే పరిస్థితి వచ్చేసరికి నాకు కొంత భీతి కలిగింది. ఇంతలో ఒక విశేషం జరిగింది. లేవండి చూపిస్తాను.

అంతా లేవండి.... మీరు సమయం కాని సమయంలో బండి దిగారు! అయినా రండి...." అంటూ అందర్నీ పెరట్లోకి తీసుకవెళ్ళాడు. పెరట్లో చిన్న పెంకుటిల్లు. ఆ గదిలో ఉయ్యాలలో నిద్రపోతున్న మగ బిడ్డ. ప్రక్కనే క్రింద సగర్వంగా కూర్చున్న ఇల్లాలు పారిజాతం....

"మామగారు! నా కొడుకండీ!" మీసాలు తిప్పుతూ, "యీ మీసాల వంశం ఇంతటితో సరి అనుకుంటే, వీడు మా వంశోద్ధారకుడు, మీసాల చంద్రరావు పుట్టాడండీ!" అసలు ఈ బంగారం చంద్రమ్మ కోరిక ప్రకారం వీడి పెళ్ళానికి చెందాలి. కానీ, వీడు పెద్దఅయితే ఈ బంగారం-తన అక్కలతో బంధాలు తెంపడానికి కారణమైందని తెలుసుకుంటే దీన్ని ఒక నాగులా చూడడూ? నా అక్కలు నేనంటే అసహ్యించుకునే పరిస్థితి యెందుకు తెచ్చావంటే నేనేమి సమాధానం చెప్పగలను? చూడండి.... మీ అమ్మాయి ముక్కూ ముఖమే. ఆ బంగారం శరీరఛాయే మీ మనుమడండీ. అమ్మాయిలూ! మీ తమ్ముడమ్మా. వాడి ముఖం చూసారు కాబట్టి-అదిగో-ఆ టేబిలు మీద నున్న ఆ బంగారం తీసుకోండి.... ఊ.....తీసుకోండి. తీసుకుని తమ్ముడ్ని దీవించండమ్మా! వాడి విలువ యిప్పుడు మీకు తెలీదు! మీరంతా మామ్మలయ్యేవరకూ కన్న వారి ఆశపోదమ్మా...."

అలా అంటూంటేనే రాజబాబు కళ్ళల్లో యింతసేపు ఆపగలిగిన కన్నీరింక ఆగలేదు. "నా చంద్రం! నీలోలేని అదృష్టం యీ చొట్ట పిల్లలో వుందన్నావు. నువ్వు చెప్పినట్లూ అక్షరాలా చేసాను. నువ్వు కోరుకున్నదే కాదు, ప్రతీ గృహస్థు కోరుకునేది ఉండడానికి ఒక స్వంత యిల్లు, వంశం నిలిపే ఒక కొడుకు-పొందేటట్లు చేసావు. చంద్రం! నాకింకే కోరికలూలేవు" అంటూ ఒక్కసారి కటువుగా-

"ఇంకా అలా చూస్తారేం? ఈ బంగారమే తండ్రికీ బిడ్డకీ వేరు చెయ్య గలిగింది. పొండి. తీసుకు పొండి. తండ్రినన్న అభిమానం కాపింతైనా మీ మనసులో లేని కూతుర్లతో నా కింకేం సంబంధం లేదు....ఇంకా మీకు యిది చాలక పోతే- యింకా యింకా గడించి యిస్తాను. ఊ. తీసుకపొండి" అంటూ ఆ బంగారాన్ని వాళ్ళ ముఖంమీద కొట్టినట్లు భుజాలమీద విసిరేసి అప్పుడే లేచిన కొడుకును యెత్తుకుని అంగట పారిజాతం చెట్టుక్రిందకు పోయాడు. *